# పావురాల కథ

ఎంత ప్రయత్నం చేసినా కళ్ళు విడట్లేదు. ఆ మసక మెలకువలో రోజంతా చేయాల్సిన పనులు , వెళ్ళాల్సిన ఫంక్షనులూ దోమల్లా కుడుతున్నాయి. పెద్ద పట్టించుకోకుండా గట్టి ముసుగు పెట్టే ప్రయత్నంలో ఉండగా ఈయన గొంతు వినిపించింది.

"పెన్నేదీ? దాని ప్లేసులో అది లేకుండా ఎక్కడికెళ్ళిందీ?"

"టీ తాగడానికెళ్ళిందేమో! కాసేపట్లో వచ్చేస్తుంది. ఐనా తెల్లారకట్ల మీకు పెన్నుతో ఏం పని?"

"రాత్రంతా కన్నార్పకుండా హాలీవుడ్ సినిమాలు చూస్తే నీకు 8.30 తెల్లారకట్లలాగా ఉంటుంది. ఇంతకీ పెన్నెక్కడుందీ? పెన్ను టీ ఎందుకు తాగుతుందీ, ఇంకు తాగుతుంది కానీ!"

"అయ్యో! అప్పుడే తెల్లారిపోయిందా? టి.ఎన్.టి. సినిమాలు చూస్తుంటే ఎంచక్కా చిన్నపుడు మా నాన్నా నేనూ లీలామహల్లో చిప్స్ తింటూ రెండో ఆట చూస్తున్నట్లుంటుంది. పాపం మా నాన్న ఎంత మంచివారో ?"

"పోన్లే నయం! మా అదృష్టం కొద్దీ, నీకు మీ నాన్నతో సినిమాలు చూసినట్లుంటాయి. హాలీవుడ్ హీరోలందరూ మీ నాన్నగారిలా ఉంటారు. పెన్ను!"

"పెన్ను కనపడకపోతే టీవీ పక్కన పెన్సిల్ ఉంటుందిచూడండి. మళ్ళీ అదెక్కడెందుకుందని మొదలెట్టకండి. సండే సందడి పజిల్ రాస్తూ అక్కడ పెట్టాను. ఇంతకీ మీకు పెన్నెందుకు ?"

"నిన్న నీకు చెప్పలే? సాయంత్రం ఎడ్వర్టైజ్‌మెంట్ ఇవ్వాలని. పెన్సిల్‌తో రాస్తే తీసుకుంటాడా ?"

"ఆఁ! డబ్బిస్తే బలపంతో రాసినా తీసుకుంటాడు. ఏమిటి ఎడ్వర్టైజ్‌మెంట్? అంత హడావిడిగా. తక్కువ వడ్డీకి ఎవడైనా అప్పిస్తాడేమోననా?" - నెమ్మదిగా ఇక లేస్తున్నా.

గబగబా కాగితం మీద ఏదో బరికి కళ్ళజోడు నా ముఖానికి తగిలించి చేతిలో ఆ పేపరు పెట్టి వెళ్ళి పోయారు. ఇంత అర్జెంటుగా ఈయనకి ఏం కావాల్సి వచ్చింది చెప్మా అని తీసి చదివా- " ప్రియమైన

గౌరవనీయులైన మా బంధుమిత్రులకు. మీ ఇంట జరగబోవు వివాహములు, జన్మదినములు, పేరంటములు, పూజలు, వ్రతములు , వీడ్కోళ్ళు, విందులు మొదలగు అన్ని శుభకార్యములకు మా ఇరువురి ఆశీస్సులు., శుభాకాంక్షలు, అభినందనలు ఎల్లప్పుడూ ఉంటాయి పనులు మరియు వయోభారం వల్ల మేం స్వయంగా పాల్గొనే పరిస్థితులు లేనందువల్ల మమ్మల్ని ఆహ్వానించి మీ, మా విలువైన సమయం వృథా చేయవలదని నా ప్రార్థన. ఇట్లు భవదీయులు......."

ఒక్క దెబ్బతో నా నిద్ర పటాపంచలైపోయింది. ఈ మనిషికి ఒక్కపూటలో ఏమైంది? నిన్న కూడా మామూలుగానే ఉన్నారు. ఈ వయసుకే మతిపోతుందా?

"ఆఁ! చదివిన పేపరు చాలు గానీ, పక్కన పెట్టండి. ఏమిటీ పిచ్చి రాతలు? మన 30 ఏళ్ళ సంసారంలో ఒక్కసారైనా మీరేదైనా పండక్కిగానీ పెళ్ళికిగానీ వచ్చారా నాతో? పోనీ నేనెప్పుడైనా బలవంతం చేశానా? అసలా మాటకొస్తే, ఈ మధ్య ఎవరూ మీరు రావట్లేదని కూడా అడగట్లేదు తెలుసా ?"

"ఎలా అడుగుతారు? ఎక్కడైనా తోరణం కట్టడం ఆలస్యం. నువ్వెళ్ళిపోయి అనృతదోషం అంటకుండా మా ఆయన ఎక్కడికీ రారండీ! ఆ చేసే మర్యాదేదో నాకే చెయ్యండీ అని చెప్తుంటే. ఇవేళ ఎలాగైనా పేపర్కిచ్చేయి."

"మీరు రానపుడు, నే వెడితే మీకేమిటి అభ్యంతరం? అంతగా ఇష్టం లేకపోతే మానేస్తా! అంతేగానీ, ఈ తిక్క రాతలేమిటి, మమ్మల్నెవరినీ పిలవకండని!"

"నా కారణాలు నాకున్నాయి. చెప్తే నీకెలాగూ అర్థం కాదు. వినే అలవాటు అసలు లేదు. పెళ్ళి పిలుపులని పేరెట్టుకుని ఆదివారం తెల్లారకట్లో, మిట్టమధ్యాహ్నమో, రాత్రి పదకొండింటికో పదిమంది రావటం. పదిహేనేళ్ళ క్రితం కట్టిన ఇంటిని పట్టుకుని 'భలే కట్టారే ఇల్లు. ఏ మాత్రం అయిందేమిటి?' అని వెధవ ప్రశ్నలూ! జీవితంలో రెండు మూడు సార్లు కూడా కలవని వాళ్ళందరి పెళ్ళిళ్ళకి నువ్వు తయారవడం. పిలవకపోతే బాగుండదని వాళ్ళు పిలవడం. పిలిచాక వెళ్ళకపోతే బాగుండదని నువ్వు అన్ని పనులూ మానుకుని వెళ్ళిపోవడం. అసలు జనాలకి మతులు పోతున్నాయి. ఉన్నవాడైనా, లేనివాడైనా పెళ్ళో మరోటో పేరు చెప్పుకుని వందలకొద్దీ మనుష్యులని పోగెయ్యడం. చిప్ప భోజనాలకి లక్షలు తగలెట్టడం. ఇంతకీ నువ్వు పేపరుకిస్తావా, ఇవ్వవా? రాజునిమ్మంటావా?"

"మీరు రాసిన మేటరుకి పదిహేను వందలవుతుంది. కనీసం నాలుగు సార్లైనా వెయ్యాలి. నాలుగు పేపర్లలో ఐనా వెయ్యాలి. అంటే కొన్ని వేలవుతుంది. నా దగ్గరంత డబ్బు లేదు. తగలెయ్యడానికి!"

"టైం మాత్రం ఉంది. నాక్కోపం తెప్పించకు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో వెయ్యి. ప్రస్తుతానికి

సరిపోతుంది. తర్వాత చూద్దాం!"

"సర్లెండి!"

"ఏమిటి సర్లెండి ? జాగ్రత్త !"

ఆలోచనలో పడ్డా. గడిచిన మూడురోజులనించీ హైద్రాబాద్‌లో నిర్విరామంగా జరుగుతున్న పెళ్ళిళ్ళలో ఏ ఒక్కటీ వదలకుండా ఆఫీసుకి ఎగనామం పెట్టి హాజరయ్యానని ఈసార్‌కి కోపం వచ్చినట్టుంది. నేను మాత్రం ఛస్తానా. ఏదైనా ఫంక్షన్‌కి పిలిస్తే వెళ్ళకపోవడానికి ఎక్స్‌ప్లనేషన్స్ ఇచ్చేకన్నా వెళ్ళిరావడమే నాకు సుళువనిపిస్తుంది.

వెళ్ళాక ఎలాగూ వెళ్ళినవాళ్ళని ఎవరూ పట్టించుకోరు. కానీ వాళ్ళు రాలేదా వీళ్ళని తీసుకురాలేదా? అని అడుగుతారు. మర్యాదలన్నీ కాటరింగు వాడు చెయ్యాల్సిందే! కిలో బరువున్న ప్లేట్లు మోసీ మోసీ నా చేతులూ, బిర్యానీ, పచ్చి ఉల్లిపాయలూ తిని తినీ నా నోరూ చచ్చుబడిపోయాయి. ఈయనక్కోపం వచ్చిందంటే పాపం, ఆయన తప్పేం లేదు. నాకే విసుగొస్తోందంటే నిజంగానే పరిస్థితులంత దారుణంగానే ఉన్నాయి. ఈయనతో పొద్దున్నే తగవు పెట్టుకుంటే జరగదు. అట్నించి నరుక్కు రావల్సిందే!

"ఈ వేళొక్కరోజు మాట్లాడకండి! మొత్తం ఐదు చోట్లకెళ్ళాలి. రెండు వడుగులు, ఒక పెళ్ళి, ఒక రిసెప్షను, ఒక సత్యనారాయణ వ్రతం. రేపు పొద్దున్ననించీ సాయంత్రం దాకా ఫ్యాక్టరీలోనే ఉంటా. ఎక్కడికీ కదలను. సరేనా?"

"సరే. ఈ ఎడ్వర్టైజ్‌మెంట్ మాత్రం ఇచ్చేసి రా! మర్చిపోయావంటే మళ్ళీ వెళ్ళాల్సివస్తుంది."

పిచ్చి బ్రాహ్మడు. రేపట్నుంచీ వెళ్ళనంటే సంతోషపడ్డారు. ఈవేళే ఆఖరి ముహూర్తం. ఎల్లుండి నించీ మూఢాలు. మళ్ళీ కొన్నాళ్ళు పనిచేసుకోవచ్చు.! అన్నీ ఈయనకెందుకూ చెప్పడం. ఐనా నాకు తెలీకడుగుతాను. ఫ్యాక్టరీలో ఉంటేనే పనిచేసినట్లా? అందరం అక్కడే పడుంటే బయటపనులెవరు చేస్తారూ! అర్థం చేసుకోరూ!

పదిన్నరకే ముహూర్తం. కాచిగూడా వరకూ పోవాలి. స్నానం చేసొచ్చి ఓ మాదిరి పట్టుచీర కట్టి తయారౌతున్నా. అత్తయ్యగారొచ్చి "అమ్మాయ్, మరువం వేసి కట్టనా, కనకాంబరాలేసి కట్టనా ?"

"ఏమిటి కట్టేది?"

"చామంతి పూలు. నువ్వు పెళ్ళికెడుతున్నావుగా!"

"ఛాల్లెండి. చామంతి పూలొక్కటే తక్కువ! నా సింగారానికి. ఫోన్లేమైనా వచ్చాయా?"

"నువ్వు పూజలో ఉండగా, పావని ఫోన్ చేసింది"

"ఏమిటట? నిన్ననేగా మాట్లాడాను!"

"నిన్ను పదిన్నరకల్లా ఆఫీసుకొచ్చేయమంది."

"ఏ ఆఫీసు? హైద్రాబాద్‌లో ఎన్ని వందల ఆఫీసులున్నాయి. మళ్ళా చెయ్యమనలేక పోయారా! పెళ్ళి కెళ్ళాలని చెప్పలేదూ?"

"తను వకీలు దగ్గరికెళ్ళి అట్నించటే అబిడ్స్ వచ్చేస్తాననంది. ఎం.డి.గారు 11 వరకే ఉంటారుట. నిన్ను అర్జెంటుగా ఎన్న పనులున్నా మానుకుని రమ్మంది. నీకన్ని వివరాలూ తెలుసునంది. వీలుంటే మీ తోటివాళ్ళ నెవరినైనా ఇద్దరాడవాళ్ళని తీసుకు రమ్మంది."

ఇలాటిదేదో వస్తుందని పొద్దున్నే ఈయన గొడవపెట్టినపుడే అనుకున్నా. ఇప్పటికిప్పుడు ఇద్దరాడ వాళ్ళంటే ఎక్కడ దొరుకు తారు?"

"పోనీ, నేను పనికొస్తానా?"

"మీరొకరు. అన్నిటికీ తయారౌతారు!ఇదేమైనా పెళ్ళికెళ్ళడం అనుకున్నారా.? అప్పుడే తొమ్మిదిన్నరై పోయింది".

"నే పోతున్నా! భోజనం ఈయనకొక్కరికే పంపండి. నేనొచ్చేసరికి సాయంత్రం అవచ్చు.. నాకోసం అన్నం వండానని సాయంత్రానికి చద్దన్నం ఉంచకండి! వింటున్నారా?"

"ఆ! ఎవరిమీద యుద్ధం? నీకు ఊళ్ళో వాళ్ళ ఊసులెందుకు. నీకక్కరలేని విషయాలు లేవు. మళ్ళీ వాడేమంటాడో?"

"వాడూ అనడు. వీడూ అనడు. అన్నీ మీరు చెప్తేనేగా తెలిసేది? పెళ్ళికెళ్ళాననుకుంటార్లే. మీరుగానీ చెప్తే ఊరుకోను. పోతున్నా !"

"శుభం! వెళ్ళిరా!"

చీర మార్చేసి హడావిడిగా బయల్దేరి కరెక్ట్ టైంకే ఆఫీసు చేరుకున్నా. దారిలో కామేశ్వరి గారినీ వాళ్ళ పక్కింటి వాటా ఆవిడ రిటైర్డు టీచర్ గారినీ ఎక్కించుకొచ్చా! సైన్సు చదువుకున్నానన్న మాటే గానీ, నాకు మూఢ నమ్మకాలెక్కువ. ముగ్గురం వెడితే పని అవదేమోనని భయం. అందుకే బతిమాలి ఆవిడని కూడా తీసుకొచ్చా.. కూడా ఉంటే చాలు మాట్లాడనక్కరలేదని ధైర్యం చెప్పి!

కామేశ్వరి గారు బయాలజీలో ఎమ్మెస్సీ చేసింది. ఏదో కొత్తది కనిపెట్టానని చెప్పి వాళ్ళాయన ప్రాణం తీసి నాలుగు లక్షలు పెట్టి యూనిట్ పెట్టింది. కానీ ఏడాది తిరక్కుండానే విషయం తనవల్ల కాదని గ్రహించి వెంటనే యూనిట్ మూసేసి అదోఇదో అమ్మేసి అప్పు తీర్చేసుకుంది. ఆయన పెద్ద లాబ్స్‌లో జాయింట్

డైరెక్టర్‌గా చేసి రిటైరయ్యారు. ఎప్పుడూ పుస్తకాల మధ్యలో ఉంటారు. ఈవిడకేమో ఇంట్లో క్షణం కాలు నిలువదు. చదువుకున్నదన్నమాటే కానీ, కబుర్లు మొదలుపెడితే తలాతోకా ఉండదు. ఇలాటి మీటింగులకి బాగా పనికొస్తుంది. తెల్లవారుతూనే నాలుగు గ్లాసుల బియ్యం - అన్నం వండేసి పెద్ద గిన్నెడు సాంబారు చేసేసి బల్ల మీద పెట్టేస్తుంది. ఆ సాంబార్లోనే వెయ్యదల్చుకున్న కూరలన్నీ చామ దుంపలైనా సరే, కాకరకాయలైనా సరే వేసేసి మళ్లీ నేషనలంత స్ట్రాంగ్‌గా చేస్తుంది.

మళ్ళీ తెల్లవారే వంటింట్లోకి వెళ్ళడం. ఇంక ఆ సాంబారు బల్లమీద పెట్టేసిందంటే బయటకి వెళ్ళడానికి రెడీ అన్నమాట. ఊళ్ళో ఏ మీటింగులైనా, వర్క్‌షాపులైనా, ధర్నాలయినా , నిరాహార దీక్షలైనా ఆవిడ తయారే. నావల్ల కాదు. నాకు ఓపిక లేదు. అనే మాట ఇప్పటివరకు ఆవిడ నోటమ్మట నుంచి నేను వినలే. అరవయ్యేళ్ళ వయస్సులో ప్రతి ఇష్యూకి టీనేజర్స్ కన్నా ఎక్కువ రెస్పాండౌతుంది. ఇందాక ఫోన్లో "ఇట్లా పావనిగారి యూనిట్‌ని బలవంతంగా కార్పొరేషన్ వాళ్ళు తాళాలేసేశారు. మనం నలుగురం వెళ్ళి ఎం.డి. గారి నడుగుదాం వస్తారా?" అంటే ఆ మాత్రం సాటి వాళ్ళకి సాయం చెయ్యకపోతే ఎలా? అని పక్కింటావిడని కూడా తీసుకు చక్కా వచ్చింది. ముగ్గురం కూచుని కబుర్లు చెప్పుకుంటుంటే పావని వచ్చింది. మహా టెన్షన్లో ఉంది. మరి లాయరేమన్నారో?

పావనితో నాకు పదేళ్ళ పరిచయం. అప్పటికే స్కూటర్ యాక్సిడెంట్‌లో వాళ్ళాయన పోతే ఇద్దరు మగపిల్లలని పెంచుకొస్తోంది. తనకున్న డబ్బులు, ఆయన పోయినపుడు వచ్చిన కాంపెన్సేషన్ సొమ్ము అంతా మదుపు పెట్టి చిన్న యూనిట్ పెట్టుకుంది. అందులో కాగితం ట్రేలు, పాకేజింగ్ పేపర్ తయారు చేసేవారు. ఆ రోజుల్లో ఇండస్ట్రీలు పెట్టమని ప్రభుత్వం చాలా ప్రోత్సహించేది. ఈవిడది ముక్కుసూటిగా పోయే స్వభావం. కష్టపడి పని చేస్తుంది కానీ సరైన సలహాలిచ్చేవాళ్ళు లేక కొంత, అనుభవం లేక కొంతా మొదట్లోనే కొన్ని పొరబాట్లు చేసింది. ఇంక ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా ఎన్ని కష్టాలు పడ్డా ఆ ఊబిలోంచి బయటపడలేక పోతోంది .

"ఎందుకు పావనీ ? అంత కంగారు పడతావు. ఎం.డి.గారిని రిక్వెస్ట్ చేద్దాం. అంతగా కుదరకపోతే కోర్ట్ కెళ్దాం!"

"లేదండీ, అదే ఇప్పుడు లాయర్ గారిని కనుక్కుని వస్తున్నా! మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్ కన్నా ఎక్కువ బాకీ ఉంటే, వీళ్ళకి యూనిట్ లాక్ చేసి ఆక్షను వేసే అధికారం ఉందట. కోర్ట్ పర్మిషను కూడా అక్ఖర్లేదుట!" ఇంతలోకీ, మాకు పిలుపు వచ్చింది. టీచర్ గారు కొంపముంచరు కదా! ఆవిడ క్లాసులో కెళ్ళినంత ధైర్యంగా లోపలికొచ్చేసింది. నలుగురం కూచోగానే ఆయన పాపం మంచినీళ్ళు తెప్పించారు.

"ఏ మహిళా సంస్థమ్మా మీది? ఈ సంవత్సరం ఎడ్వర్‌టైజ్‌మెంట్ కోటా ఐపోయింది. మా పి.ఆర్.ఓ.ని కలవాల్సింది!"

"మేం ఎడ్వర్‌టైజ్‌మెంట్ కోసం రాలేదు సార్! నా పేరు పావని. వీళ్ళు మా తోటి వ్యవస్థాపకులు. అందరం స్వయంగా యూనిట్స్ నడుపుతూ ఉంటాము."

"మీదే యూనిట్టమ్మా?"ఎంతైనా ఐ.ఎ.ఎస్. ఆయన గదా! టీచర్‌గారిని అడిగారు.

నాకైతే, గుండె డెక్కు పట్టేసి నట్లైపోయింది. ఇంకేముంది? అంతా ఐపోయింది!

ఆవిడ మొదలు పెట్టింది "పౌల్ట్రీ ఫీడ్ చెస్తామండీ. మియాపూర్ దగ్గర ఉంది. మాకు అప్పేం లేదు. సొంత డబ్బుతోనే చేస్తున్నాం. పదిమంది పనివాళ్ళున్నారండీ. పావనిగారిదీ మాదీ ఒకే ఊరు. ఆవిడని చూస్తే నాక్కూడా ఏదైనా చెయ్యాలనిపించి నాలుగేళ్ళక్రితం మొదలుపెట్టానండీ. ఇప్పుడు పాపం ఆవిడకి సాయం రమ్మంటే వచ్చానండీ !మాకెవరికైనా సమస్యలొస్తే ఒకరికొకరు తోడుగా ఉంటామండీ!"

"మేం నలుగురం వచ్చామని మీరు మరోలా అనుకోకండి. నిన్న జరిగిన సంఘటనతో నేను చాలా నెర్వస్‌గా ఐపోవడంతో నాకు తోడుగా వీళ్ళు వచ్చారు!" - అంది పావని.

"చెప్పండి. నేను చేయగల సాయం ఏదన్నాఉంటే తప్పక చేస్తా! మీ యూనిట్ పేరేంటన్నారూ? నిన్న ఏం జరిగింది?"

"మాది ఉషా పాకేజీస్ సర్! 89లో మీ కార్పొరేషన్ వాళ్ళు నాకు మెషినరీకి 19 లక్షలప్పిచ్చారు. నేను 4 లక్షలు మార్జిన్ కట్టి, ఒకటిన్నర ఎకరం నేల 3వేల అడుగుల షెడ్ కొలేటరల్‌గా ఇచ్చాను. మాది చర్లపల్లిలో ఉంది సార్! నిన్న ఉదయం మీ ఆఫీస్‌నుంచి కొందరు అఫీషియల్స్ వచ్చి పనిచేస్తున్న 20మంది వర్కర్లని బయటకి పంపి యూనిట్‌కి తాళాలేసేశారు సార్! ఈ నెలాఖరులోగా 2 ఇన్‌స్టాల్‌మెంట్‌లు కడతామని చెప్పినా వినిపించుకోలేదు. పైగా ఈవారం డిస్పాచ్ చేయాల్సిన స్టాక్ కూడా లోపలుండిపోయింది. దాని విలువే 1.5 లక్షలుంటుంది!" పావనికి నోట మాట కూడా సరిగ్గా రావటం లేదు. దుఃఖం, ఆవేశం, నిస్సహాయతా - అన్నీ కలగలిపి ఒక ఆడ కూతురు మాట్లాడుతుంటే పాట కచ్చేరిలా ఉండదు కదా!

తన కంఠ స్వరం విని ఆయన కూడా ఇబ్బందిగా ఫీలయ్యారు. ఇంటర్‌కంలో చెప్పారు "దినకర్ , ఉషా పాకేజీస్ ఫైల్‌తో ఒకసారి వస్తారా?"

రెండు నిమిషాల్లో అపుడే పన్నెండయ్యిందా అన్నంత కరకరలాడుతూ దినకరుడు ప్రత్యక్షం అయ్యాడు. ఆ ఫైలు ఎం.డి.గారి ముందు పెట్టి చాలా చిన్న స్వరంతో చెప్పాడు.

"మొన్న కమిటీ యాక్షన్ తీసుకునేందుకు ఎప్రూవ్ చేసింది సార్!"

"వీరికి నోటీస్ కానీ, లెటర్ కానీ పంపారా?"

"రెండు నోటీసులు ఇష్యూ చేశాం సార్!"

ఇంతలోకే, తన దస్త్రంలోంచి పెద్ద ఉత్తరం తీసింది. పావని. " మా కొక్కటే వచ్చింది సార్. ఇందులో మా రిప్లై కూడా వుంది. ఈ నెలాఖరులోగా రెండు ఇన్‌స్టాల్‌మెంట్స్ , అంటే 80 వేలు కడతామని రాశాం సార్. ఇప్పుడు డిస్పాచ్‌కి రెడీగా ఉన్న సరుక్కి డిస్ట్రిబ్యూటర్ 80 వేలిచ్చి పట్టుకెళతానన్నారు. మేం ఆ మొత్తం కడదామనుకుని రాశాం సార్! ఎంత చెప్పినా వినిపించుకోకుండా లాక్ చేసేశారు సార్! నడిచే నడిచే యూనిట్‌ని లాక్ చేస్తే మీ బాకీ ఎలా తీర్చగలం సార్?"

దినకర్ అందుకున్నాడు -"ఈవిడ ఎప్పటికప్పుడు కడతాననడమేగానీ పెద్దగా కట్టిందేమీ లేదు. సార్!"

"మొన్ననేగా 40వేలు కట్టాం?"

"5 లక్షల 60వేలకి, 40 వేలు కట్టారుట! చూడండి సార్!"

"సర్ !అందులో 3లక్షల 40వేలు ఇంటరెస్ట్ కాంపొనెంటేగదా!"

"అంటే , మీరు ఈమధ్య పేమెంటేమీ చెయ్యలేదా?"

"లేదు సార్. ఎప్పుడూ వీళ్ళ పార్ట్నర్స్ గొడవలు....."

"దినకర్! ఆమెని చెప్పనివ్వండి!"

ఆ ఐ.ఏ.ఎస్. ఆఫీసరెవరో తప్పబుట్టినట్టున్నారు. ఇంత పురాతనంగా అంటే నేత చీరలు, ముడులతో ఉన్న నడివయసు దాటిన మమ్మల్ని కూచోమని మర్యాద చేయడమే కాకుండా మేం చెప్పేది వినే సాహసం కూడా చేస్తున్నారు.

పావని మొదలుపెట్టింది. "89లో మన రాష్ట్రంలో ఆ ప్రోడక్ట్ మొదటిసారిగా పెట్టాను. మీరు లోనిచ్చిన ఆరునెల్లల్లో బిల్డింగ్ పూర్తి చేసి మెషినరీ కూడా ఎరెక్ట్ చేశాం. కానీ పవర్ కనెక్షన్ రావడానికి సంవత్సరం పట్టింది. అప్పట్లో ప్రోడక్ట్‌కి మంచి డిమాండ్ ఉండేది. ధర కూడా బాగుండేది. మంచి డిస్ట్రిబ్యూటర్ ఉండేవారు. మా ప్రోడక్ట్ చేసే మిషనుకి ఉన్న గిరాకీ చూసి సగం కెపాసిటీతో పనిచేసే మిషను 8లక్షలకి అదే కంపెనీ వాడు తయారు చేశాడు. మీరు, మిగతా బ్యాంకులూ కలిపి ఇదే ప్రోజెక్టుకి ఇంకో 12మందికి లోన్లు శాంక్షన్ చేశారు. దాతో అప్పటివరకు ఒక్కోటి రూపాయి అమ్ముతున్న మా ట్రే అరవై పైసలకి పడిపోయింది!

అప్పటికి మేం వడ్డీతోబాటు 4 ఇన్‌స్టాల్‌మెంట్‌లు కూడా కట్టాం. ధరలు తగ్గి చాలా కన్‌ఫ్యూజన్‌లో ఉన్నపుడు మా పార్ట్నర్ 20 పైసలవాటా ఆయన డైరెక్టర్‌గా రిజైన్ చేసి మీకు తన గ్యారంటీ విత్‌డ్రా

చేసుకుంటున్నానని రాశారు. ఇది కేవలం మా కుటుంబంలో కలహాల వల్ల జరిగింది. అప్పుడుకూడా మీ ఆఫీస్ వాళ్ళు వెంటనే వచ్చి మా యూనిట్‌ని లాక్ చేసేశారు. షుమారుగా నడుస్తున్న యూనిట్ తాళంపడటంతో డిస్ట్రిబ్యూటర్ ఇంకొకళ్ళతో ఎగ్రిమెంటు కుదుర్చుకుని మమ్మల్ని డిపాజిట్ వాపసు ఇమ్మని అడిగి తీసేసుకున్నాడు!"

"ఇది ఎప్పుడు జరిగింది?"

"92లోనండీ. అప్పుడు మా ఊళ్ళో పొలం అమ్మి 2 లక్షలు కట్టి ఒక స్థలం 600 గజాలు సెక్యూరిటీ ఇచ్చి యూనిట్ తెరిపించాం సర్!"

"ఆ తర్వాత ఏమాత్రం కట్టారు?"

"యూనిట్ ఐతే మా చేతికి వచ్చింది గానీ డిస్ట్రిబ్యూటర్ తప్పుకోవడంతో బిజినెస్ బాగా దెబ్బ తింది సార్! ఎలక్ట్రిసిటీ బోర్డుకి మినిమమ్ బిల్ ఏడాదికి 1.2 లక్షలు కడితేగానీ రీ కనెక్షన్ ఇవ్వలేదు. ఈలోపల కాగితం ధర, ట్రేల ధర ఇంకా తగ్గి 55పైసలైంది. అందువల్ల ఈ మూడు నాలుగేళ్ళలో కొద్దిగా కట్టాం కానీ, చెప్పిన ప్రకారం కట్టలేకపోయాం సార్!"

"ఇప్పుడు నేను చేయగల సాయం ఏముంటుందమ్మా? కమిటీ అన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకుందిగా! తెరిచినా మీరు ఎలా ప్రొడక్షన్ చేస్తారు? ఇంత ఎమౌంట్స్ ఎలా కడతారు?"

ఇంతలోకి కామేశ్వరిగారి బుర్ర పనిచేసినట్లుంది "ఈ పీరియడ్ అంతా సిక్ యూనిట్‌గా పరిగణించి వడ్డీ కాంపౌండింగ్ చేయకుండా మళ్ళీ అంతా రీషెడ్యూల్ చేయచ్చు గదండీ! ఆవిడ పరిధిలో లేని పరిస్థితుల వల్ల యూనిట్ సిక్ ఐతే, ఏం చేస్తారు? తన ప్రయత్న లోపం ఏమీ లేదు కదా. పైగా ఉన్న ఆస్తులన్నీ ఈ యూనిట్‌కి పెట్టారు కదా!"

నేనూ వంత పాడా. "అమ్మాలన్నా, ఆక్షన్ చేయాలన్నా కూడా నడిచే యూనిట్టైతేనే మంచిది కదా సార్! లాక్ చేస్తే మిషన్లన్నీ పాడైపోతాయి కదా! ఈ లోపున ఆవిడని పనిచేసుకోనిస్తే కొంత కడుతూ ఉంటారు. మీకు సరైన పార్టీ దొరికితే హాండోవర్ చేస్తానని రాసిస్తారు."

పాపం ఆయన ఆలోచనలో పడ్డారు. కానీ నక్షత్రకులులేనిదే పురాణాలెక్కడనించి వస్తాయి. దినకరు డందుకున్నాడు. "ఏ పేమెంట్ లేకుండా యూనిట్ తెరవడం కష్టం సార్. ముందు వాళ్ళని 2 లక్షలు కట్టమనండి సార్!"

"లక్షలు కట్టాలంటే కష్టం సార్! పైగా వర్కింగ్ కాపిటల్‌కే ఇంకో 50 వేలు కావాల్సి వస్తాయి."

"2 లక్షలైనా లేనివాళ్ళు యూనిట్టెలా నడుపుతారమ్మా?" ఇంక దినకర్‌తో మాట్లాడటం మొదలు

పెట్టారు.

"వీరికో లెటర్ ఇష్యూ చేయండి! ఈ మీటింగ్‌ని రెఫర్ చేస్తూ. 2 లక్షలు పది రోజుల్లోగా కడితే రీకన్సిడర్ చేస్తామని!"

వెంటనే బెల్లు కొట్టారు.

చివరి నమస్కారం పెట్టి బయట పడ్డాం.

కొన్ని యుగాలు ఆయనతో మాట్లాడినట్లనిపించింది. తీరా బైటకొచ్చి టైం చూస్తే 5 నిమిషాలు తక్కువ 11. ఇప్పట్నించీ వెళ్ళిపోయి ఏం చేస్తాం. ఇంకోసారి దినకరుడినే కదుపుదామని వెళ్ళాం. టీ తాగడానికని వెళ్ళిన పెద్దమనిషి 11.30కి వచ్చాడు.

"ఏం మేడం, నేను మీకు మొన్ననే చెప్పాను కదా! ఎవరిదగ్గరికెళ్ళినా పనవదని! నేనప్పుడు మంచి పార్టీని మీకు పంపిస్తే మాట్లాడకుండా తరిమేశారు. ఇప్పుడు నాచేతిలో కూడా ఏమీ లేదు!"

"ఏం పార్టీ సార్! 30 లక్షలుచేసే యూనిట్‌కి మీకు 8 లక్షలు కడతానన్నాడు. నాకు ఒక లక్ష ఇస్తానన్నాడు. మిగిలినదెక్కడినించి వస్తుంది? మళ్ళీ మా మీదకి ఆర్.ఆర్. యాక్ట్‌తో వస్తారు కదా!"

"ఇంక మీకు వేరే ఆస్తులేమీ లేనపుడు భయం దేనికి? ఆ ప్రోడక్ట్‌కి కాంపిటీషన్ ఎక్కువైపోయింది. ధర తక్కువైపోయిందని మీరే అంటున్నారు కదా! తెలిసి తెలిసీ ఎవరొస్తారు?"

"ఉత్త ల్యాండూ, బిల్డింగే 25 లక్షలు చేస్తుంది. నా సొంత డబ్బే 10 లక్షలు పెట్టాను. దేనికైనా న్యాయం ఉండాలి కదా!"

"మరి మీ ఇష్టం. రేపు లెటర్ పంపిస్తాను!"

నే వెళ్ళింది చోద్యం చూడటానికి కాదు కదా! " పోన్లెండి సార్! మీ పరిధిలో లేని విషయాలకి మీరు మాత్రం ఏం చేస్తారు? సోమవారం నాడు మా అసోసియేషన్ మీటింగ్‌కి సి.ఎం.గారు వస్తున్నారు. మా సమస్యలు పరిష్కరించడానికి. వారికి విన్నవించుకుంటాం. మాకేమైనా సాయం చేసి మా యూనిట్ తెరిపిస్తారేమో? మేమేమీ చార్మినారు మాకు రాసిమ్మని అడగట్లేదుగా. మా యూనిట్లో పనిచేసుకోనిమ్మంటున్నాం. ఆయన తనవల్ల కాదంటే శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు ఉండనే ఉన్నాయి. కాని మీరు మాకు ఇన్ని సంవత్సరాలుగా తెలిసినవారవటం వల్ల మిమ్మల్ని అడుగుతున్నాం. సాయం చేస్తే మీ ఋణం ఉంచుకోం."

"సి.ఎం.గారు నిజంగా మీ అసోసియేషన్‌కి వస్తున్నారా? ఆయనకి అంత తీరుబడెక్కడ?"

"ఎందుకు రారు. మేం ఎప్పుడు పిలిచినా ఆయన కాదనరు. మేం అడిగేదాంట్లో రీజను ఆయనకి

అర్థం ఔతుందనే నమ్మకం మాకుంది. ఇండస్ట్రీలు పెట్టమనగానే ఐపోదు కదా! మరి మాకు కష్టమొచ్చినపుడు ఆదుకోడానికి కాకపోతే మీరంతా ఎందుకు! రేపు మళ్ళీ మీ దగ్గర ఇంకో పదిమంది అప్పుకి రావాలంటే మేం సరైన ఉదాహరణలవాలి కదా! పని చేసి అప్పు తీరుస్తామంటున్నాం కానీ బాకీ ఎగ్గొట్టి పారిపోవడం లేదు కదా!" చెప్పేదేదో చెప్పేసి సెలవు తీసుకుని బయటపడ్డాం.

"ధైర్యంగా ఉండండి. సోమవారం నాటికి రిప్రెజెంటేషన్ రాసి అందరం సంతకాలు పెట్టి ఇద్దాం. ఇప్పట్నుంచీ డీలా పడకండి!" - అని ధైర్యం చెప్పి అందరం కాచిగూడాలో పెళ్ళి భోజనాల టైంకి చేరుకున్నాం. భోజనాలు చేస్తూ అడిగా.

"టీచర్‌గారూ, మీరు భలేగా చెప్పారే. నాకెంత కంగారు వేసిందో! మిమ్మల్నెందుకు అడిగారో అని."

"ఎందుకమ్మా కంగారూ నిజంగానే మా మేనల్లుడి పౌల్ట్రీ ఫీడ్ యూనిట్లో నాకు పావలా వాటా ఉంది. శని ఆదివారాలు అక్కడే పనిచేస్తా - ట్యూషన్లుండవు కదాని. నేనేం లేనిది చెప్పలేదు. అసలు నాకింట్రస్ట్ ఉండబట్టే కామేశ్వరిగారడగగానే వచ్చా.!"

ఈసారి ఆశ్చర్యపడటం నా వంతైంది. ఎవరిళ్ళ దగ్గర వాళ్ళని దించి ఫ్యాక్టరీ చేరుకునేసరికి రెండయింది. ఆయన అప్పటికే భోం చేసి ఏదో చదువుకుంటున్నారు.

"అయ్యో! అంతా తినేశా నీకుంచడం మర్చిపోయి!"

"మీరేం మర్చిపోలేదు. మీకొక్కరికే పంపారు అమ్మ. ఇంతకీ ఏం చెప్పారు మీతో?"

"పెళ్ళిళ్ళకెళ్ళేదుట. పావనితో కలసి ఏదో మీటింగుకెళ్ళిందని చెప్పారు. నాతో చెప్పద్దన్నావన్నారు. ఇంతకీ ఏమన్నారు ఎం.డి.గారు? వర్కింగ్ అవర్స్‌లో ఊరికే పెళ్ళిళ్ళనీ పేరంటాలనీ తిరిగితే, చిరాకేస్తుంది కానీ ఎవరికైనా ఉపయోగించే పనులు చేస్తే ఎవరు కాదంటారు?"

"గొప్పే. పొద్దున్నే నాకెంత విసుగొచ్చిందో? ఎం.డీ.గారు మర్యాదగానే విన్నారు. కానీ పనయ్యేట్టులేదు. చెప్పడం ఐతే గట్టిగానే చెప్పాం! ఇంక సి.ఎం.గారికి రిప్రెజెంటేషనిద్దామనుకున్నాం."

చింకి చేటంత మొహం చేసుకుని శనివారం పన్నెండయ్యేసరికి మా యూనిట్‌కి వచ్చింది పావని. చేతిలో రెపరెపలాడుతున్న కాయితంతో. "పొద్దున్న దినకర్‌గారు ఫోన్‌చేసి రమ్మంటే ఆఫీసుకెళ్ళా! వారం రోజుల్లో 50 వేలు కడితే యూనిట్ తెరుస్తారుట. 6నెలల్లో రెగ్యులరైజ్ చేయమని ఉత్తరం ఇచ్చారు. ఇదుగో, మీకు ఎలా థ్యాంక్స్ చెప్పుకోవాలో?" - తనకి సంతోషంతో కళ్ళనిండా నీళ్ళే.

"అవి చాల్లే! మళ్ళీ ఈ పరిస్థితి రానీయకు మరి!"